సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



పీజీ ప్రవేశాలకు వేళాయె

నేటి నుంచి పీజీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. బీఆర్‌ఏయూలో ఏర్పాట్లు పూర్తి చేశారు. - 8లో



తండ్రిపై తనయుడి దాడి

తండ్రి పాలిట కొడుకే కాలయముడయ్యాడు. టెక్కలిలో ఈ ఘటన జరిగింది. - 8లో

16న ఇన్‌స్టెంట్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీలో ఆరో సెమిస్టర్‌లో ఒక్క సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 16న ఇన్‌స్టెంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. వర్సిటీలో సోమవారం వివరాలు వెల్లడించారు. వర్సిటీ కేంద్రంగా ఉదయం 10 నుంచి 1 గంట వరకు ఈ పరీక్ష ఉంటుందని అన్నారు. అర్హత గల విద్యార్థులు రూ.1200 ఫీజు చెల్లించి జ్ఞాన భూమి పోర్టల్‌లో ఈ నెల 14లోపు రిజర్వేషన్ చేసుకోవాలని అన్నారు.

బంద్‌కు స్పందన కరువు



శ్రీకాకుళం రోడ్డుపై కనిపించని బంద్ ప్రభావం



యధావిధిగా వెళ్తున్న బస్సులు

- టీడీపీ పిలుపును లెక్క చేయని జనం
- చంద్రబాబు అరెస్టును తేలికగా తీసుకున్న ప్రజలు
- జిల్లాలో కనిపించని బంద్ ప్రభావం
- యధావిధిగా తెరచుకున్న టీడీపీ నాయకుల దుకాణాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ పిలుపునిచ్చిన బంద్‌కు జనం నుంచి స్పందన కరువైంది. సాక్షాత్తూ హెరిటేజ్ దుకాణాలనే మూయలేదు. 'మీరు సంస్థలు, వ్యాపారాలు చేసుకుని సంపాదించుకుంటారు.. మేము నష్టపోవాలా' అంటూ సామాన్యులు ఎవరూ బంద్ పాటించలేదు. టీడీపీ నాయకులు ఒత్తిడి చేసినా ఎవరూ లెక్క చేయలేదు. చంద్రబాబు అరెస్టును ప్రజలే కాదు టీడీపీ నాయకులూ లెక్క చేయలేదు. ఆయన కోసం తామెందుకు షాపులు మూయాలి అన్నట్టుగా ఎప్పటిలాగే షాపులు తెరిచారు. అచ్చెన్నాయుడు ఇలాకాలోనూ, కూన రవికుమార్ సొంత నియోజకవర్గంలోనూ, కళా వెంకటరావు ఇన్‌చార్జిగా ఉన్న ఎచ్చెర్లలోనూ, ఎమ్మెల్యే బెందాళం అశోక్ సొంత మండలంలోనూ బంద్ జాడే లేదు.

జిల్లాలో టీడీపీ బంద్ విఫలమైంది. ఎలాంటి ప్రభావం చూపలేదు. ప్రజలు సహకరించలేదు. వ్యాపారులు కనీసం పట్టించుకోలేదు. ఏ మాత్రం సానుభూతి చూపించలేదు. ఆమదాలవలస, పొందూరు, కంచిలిలో ఒత్తిడి చేసి షాపులు మూయించేందుకు టీడీపీ నాయకులు కొందరూ ప్రయత్నించినా ఫలితం శూన్యం. ప్రభుత్వ, ప్రైవేటు కార్యకలాపాలు ఎప్పటిలాగే సాగాయి. పరిశ్రమలు, వ్యాపార సంస్థలన్నీ రోజువారీగా కొనసాగాయి. బస్సుల రాకపోకలు యధావిధిగా సాగాయి. కొన్నిచోట్ల టీడీపీ నాయకులు హల్‌చల్ చేసినా జనాలు పట్టించుకోలేదు.

అనుకున్నదొక్కటి– అయ్యిందొక్కటి

అధినేత చంద్రబాబు అరెస్టుతో సానుభూతి వస్తుందని టీడీపీ నాయకులు ఆశించారు. ప్రజల్లోకి తమకు అనుకూల సంకేతాలు పంపించాలనుకున్నారు. అందుకే బంద్‌కు పిలుపునిచ్చారు. కానీ అలా జరగలేదు. ప్రజలే కాదు టీడీపీ అభిమానులు సైతం పెద్దగా బయటకు రాలేదు. కనీస నిరసనలు కనిపించలేదు. దీంతో టీడీపీ నాయకులు కంగుతిన్నారు. ప్రజల నుంచి స్పందన లేకపోవడమేంటని, చంద్రబాబును అరెస్టు చేసినా పట్టించుకోకపోవడమేంటని, ఇంత దారుణమైన స్పందన రావడమేంటని టీడీపీ నాయకులు తలలు పట్టుకున్నారు.

ఆర్టీసీపై కనిపించని బంద్ ప్రభావం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ బస్సులపై బంద్ ప్రభావం కనిపించలేదు. జిల్లాలోని శ్రీకాకుళం ఒకటి, రెండో డిపో, టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోల పరిధిలో 321 ఆర్టీసీ బస్సులకు గాను 319 తిరిగాయి. అలాగే 94 అద్దె బస్సులు కూడా నడిచాయి. ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోకుండా యధావిధిగానే తమ గమ్యస్థానాలకు చేరుకోగలిగారు. డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 65 రూట్లలో బస్సులు యధావిధిగా నడిచాయని తెలిపారు.



ఇచ్ఛాపురం టౌన్‌లో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావుకు చెందిన డిపార్ట్‌మెంట్ స్టోర్ ఇది. తన పార్టీ ఇచ్చిన బంద్ పిలుపును కనీసం పట్టించుకోలేదు. ఎప్పటిలాగానే తన షాపును తెరిచి, కార్యకలాపాలు సాగించారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ షాపింగ్ సముదాయమిది. ఇందులోనే టీడీపీ కార్యాలయం ఉంది. పలు దుకాణాలు ఉన్నాయి. కానీ ఒక్కటీ మూయలేదు. పార్టీ కార్యాలయం ఉన్న చోటే స్పందన లేదు.





కొత్తూరులో ఉన్న పాతపట్నం టీడీపీ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ షాపింగ్ మాల్ ఇది. టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపును ఏ ఒక్క దుకాణం పట్టించుకోలేదు. యధావిధిగా షాపులన్నీ నడిచాయి.

రణస్థలం మండలం టీడీపీ అధ్యక్షుడు లంక శ్యామ్ షాపింగ్ కాంప్లెక్స్ ఇది. టీడీపీ పిలుపు మేరకు ఏ ఒక్క దుకాణం మూయలేదు. దీంట్లో టీడీపీ నాయకులు లంక ప్రభ, రౌతు శ్రీను, తదితర నాయకుల దుకాణాలు ఉన్నాయి. పార్టీ ఇచ్చిన బంద్ పిలుపును సొంత పార్టీ నాయకులే లెక్క చేయలేదు.



కోటబొమ్మాళి మండలంలోని నిమ్మాడ గ్రామమిది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు స్వగ్రామమిది. ఇక్కడెక్కడా బంద్ ఛాయలే కన్పించలేదు. యధావిధిగా దుకాణాలు, కార్యకలాపాలు నడిచాయి.



ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమాల నిర్వహణపై గ్రామస్థాయి ప్రణాళికలతో అధికారులు తేదీలు ఖరారు చేయాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమం మాదిరిగానే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాలు గ్రామస్థాయిలో నిర్వహించాలన్నారు. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయాలని, వైద్యులను నియమించాలన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ఏ గ్రామా ల్లో నిర్వహిస్తారో ముందస్తుగా ప్రకటన చేయాలని ఆయన సూచించారు.



జెడ్పీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు వారి పరిధిలోని అన్ని కుటుంబాలను సందర్శిస్తారని తెలిపారు. ఇంటిలో ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి ఏఎన్‌ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇస్తారని చెప్పారు. ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు ఇంటింటికీ వెళ్లి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. గ్రామాల్లో, వార్డుల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ వైద్య శిబిరాలకు స్పెషలిస్టు డాక్టర్లు ఇద్దరు, ఆ మండలంలోని పీహెచ్‌సీ డాక్టర్లు ఇద్దరు మొత్తం నలు గురు హాజరవుతారని, రోగులకు అక్కడికక్కడే శిబిరంలో చికిత్స అందజేస్తారని అన్నారు. ఈ నెల 15 నుంచి గ్రామ వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య రక్షణ పై అవగాహన కల్పిస్తారు. 16వ తేదీన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ పరిధిలోని గృహాలను ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సందర్శిస్తారని తెలిపారు.

జగనన్న సురక్ష ఏర్పాట్లపై సమీక్ష

అరసవల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రీజనల్ డైరెక్టర్ జోన్–1 ఎస్.ఉమా సుందరి, జగనన్న సురక్ష జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జగనన్న సురక్షపై సమీక్ష నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు గ్రామ స్థాయిలో ఈనెల 15 నుంచి ప్రారంభమవుతాయని, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తారని తెలిపారు. 16న వైఎస్సార్ విలేజ్ క్లినిక్ పరిధిలోని గృహాలను ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సందర్శిస్తారని అన్నారు.

స్పందనకు 132 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 132 వినతులు అందాయి. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ జి.జయదేవి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, డీఆర్‌డీఏ పథక సంచాలకులు డాక్టర్ డీవీ విద్యాసాగర్‌లు వినతులు స్వీకరించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ డివిజన్లలో అధికారులు ప్రతివారం సంబంధిత అధికారులతో సమావేశాలను ఏర్పాటు చేసి, స్పందన సమాధానాలతో సంతృప్తి చెందక పోవడానికి గల కారణాలను తెలుసుకొని, వాటికి పరిష్కారం చూపాలన్నారు.

ఎస్పీ స్పందనకు 36 వినతులు



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి వచ్చిన బాధిత ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎస్పీ జీఆర్ రాధిక హామీ ఇచ్చారు. ఈ మేరకు ఫిర్యాదుదారుల నుంచి 36 అర్జీలు ఎస్పీ అందుకుని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీతో పాటు అర్జీలు అందుకున్నవారిలో అడిషనల్ ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి ఉన్నారు.

రిమ్స్‌లో మరిన్ని సేవలు



కొత్తగా వచ్చిన సీ ఆర్మ్ యంత్రం

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో రోగులకు మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పలు పోస్టులను భర్తీ చేయగా తాజాగా జిల్లాలో ఉన్న స్పెషలిస్టు పోస్టులను నియమించేందుకు ప్రభుత్వం ఈ నెల 13, 15 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. రిమ్స్ వైద్యశాలతో పాటు జిల్లాలోని ఆస్పత్రులు, ప్రాథమిక ఆరో గ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న నిపుణుల పోస్టులను భర్తీ చేస్తారు.

ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ పోస్టులు భర్తీకి త్వరలో నోటిఫికేషన్

రిమ్స్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న 26 ఎన్ఎన్‌ఓ, 32 ఎఫ్ఎన్‌ఓ పోస్టులను భర్తీ చేసేందుకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎఫ్ఎన్‌ఓ (ఫిమేల్ నర్స్ ఆర్డరీ), ఎంఎన్‌ఓ (మేల్ నర్స్ ఆర్డరీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయిలో నివేదించటంతో కమిషనర్ ఈ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు.

మరో రెండు యంత్రాలు

శస్త్ర చికిత్సలు నిర్వహించే సందర్భంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు వినియోగించే సీ ఆర్మ్ యంత్రాలను ప్రభుత్వం రిమ్స్ ఆస్పత్రికి శనివారం పంపించింది. రెండు నెలల కిందట రెండు యంత్రాలను పంపించగా వాటిని ఆపరేషన్ థియేటర్లలో అమర్చారు. ఇప్పుడు మరో రెండు యంత్రాలు రావటంతో ఎమర్జెన్సీ వార్డు, ట్రామా కేర్ విభాగాలకు అనుబంధంగా ఉన్న ఆపరేషన్ థియేటర్లలో అమర్చారు. వీటిని వినియోగించడం వల్ల శస్త్ర చికిత్స త్వరిత గతిన పూర్తి చేయటమే కాకుండా ఎలాంటి పొరపాటు జరగకుండా విజయవంతంగా శస్త్ర చికిత్స జరిపేందుకు అవకాశం ఉంది.

పోస్టుల భర్తీతో మరిన్ని సేవలు



రిమ్స్‌లో ఖాళీగా ఉన్న ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓ పోస్టులు భర్తీ అయితే రోగులకు మరిన్ని మంచి సేవలు అందుతాయి. ఈ నెలాఖరు నాటి కి పోస్టులు భర్తీ అయ్యే వీలుంది. వైద్యుల పోస్టులు కూడా ఈనెల 20వ తేదీలోగా భర్తీ అవుతాయని భావిస్తున్నాం. సీ ఆర్మ్ యంత్రాలను వినియోగించటం వల్ల ఎంతో ఉపయోగ కరం. – డాక్టర్ ప్రసన్న కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్, రిమ్స్

నేడు అరసవల్లిలో మహా రుద్రాభిషేకం



ప్రధానార్చకులు శంకరశర్మ

అరసవల్లి: దేశ ప్రజల సంక్షేమం, లోక కల్యాణం కోసం అరసవల్లి సూర్యక్షేత్రంలో మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి మహా రుద్రాభిషేకం ప్రారంభమవుతుందని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలియజేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఏకాదశ పార్థివ మహాలింగ ప్రస్తారాలకు మహా రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లుగా వివరించారు. ఈనెల 4 నుంచి ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు గురు వక్రగతి జరుగుతున్నందున, అలాగే శని, సూర్యగ్రహాలు ఈనెల 18 వరకు సమసప్తకములో ఉన్నందున ఈ గ్రహస్థితుల సమ్మేళనాల సందర్భంగా సామాజిక, ఆర్థిక పరిపుష్టి కోసం ఈ రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ మహత్తర కార్యక్రమం కోసం భక్తులు తరలివచ్చి హాజరుకావాలని శంకరశర్మ కోరారు. ఆలయ పాలకమండలి సభ్యు లు, ఆలయ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమా న్ని ఆలయ మండపంలో జరిపించుటకు నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు.

ప్రజాకోర్టులో బాబును దోషిగా నిలబెట్టండి



బెండిలో గడప గడపకూ మన ప్రభుత్వంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ప్రజా కోర్టులో దోషిగా నిలబెట్టాలని రాష్ట్ర పశు సంవర్థక, పాడి పరిశ్రమ, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బెండిలో సోమవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావు దొర అధ్యక్షతన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రూ.371 కోట్లు మింగేసిన చంద్రబాబు దొరికిన దొంగలకు దొంగ అని అన్నారు. ఇప్పటి వరకు నిప్పునని చెప్పుకున్న చంద్రబాబు తప్పునని నిరూపించుకున్నారని చమత్కరించారు. లోకేష్ పాదయాత్రలో జనం మెప్పు కోసం బట్టలూడదీస్తా.. ఊరేగిస్తా అంటూ వైఎస్సార్ సీపీ నేతలపై నోరు పారేసుకుంటున్నారని అన్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం హనుమంతు అప్పయ్య దొర ఎంతో శ్రమించారని గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టును పూర్తి చేసి ఆయన కలలు సాకారం చేస్తామని అన్నారు. ముఖ్యంగా బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు ప్రాంతాల్లోని 800 ఎకరాల భూములకు బెండి గెడ్డపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తామని, త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు. చంద్రబాబుకు అవకాశం ఇస్తే మళ్లీ జన్మభూమి కమిటీలతో దోపిడీకి తెర తీస్తారని, వైఎస్ జగన్ సంక్షేమ పాలన అందిస్తారని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మ్యాథ్స్, బోటనీ, ఫిజిక్స్, ఎకనామిక్స్, హిస్టరీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ సబ్జెక్టులకు మంగళవారం జిల్లా డీవీఈఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తామన్నారు. పీజీలో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన అర్హులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

బొమ్మిక గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

పాతపట్నం: పాతపట్నం మండలం బొమ్మిక గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.మార్కండేయులును సస్పెండ్ చేసినట్లు మెళియాపుట్టి ఏటీడబ్ల్యూఓ ఆర్.కృష్ణవేణి సోమవారం తెలిపారు. నాడు–నేడు పనుల్లో భాగంగా పనుల్లో అలసత్వం, నిధుల దుర్వినియోగం తదితర అంశాల్లో ప్రధానోపాధ్యాయుడు మార్కండేయులపై ఐటీడీఏ పీఓ కల్పనకు గిరిజన సంఘ నాయకులు ఫిర్యాదు చేయడంతో మూడు సార్లు నాడు–నేడు నిధులపై విచారణ చేపట్టి, నిధులు దుర్వినియోగం చేసినట్లు, నిధులు సొంత అవసరాలకు వినియోగించినట్లు గుర్తించి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశారు. సోమవారం ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు సస్పెన్షన్‌కు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏటీడబ్ల్యూఓ తెలియజేశారు.

ధర్మానను కలిసిన జిల్లా రెవెన్యూ అధికారి



మంత్రి ధర్మానను కలిసిన జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును సోమవారం రాత్రి పెదపాడులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'



మాట్లాడుతున్న ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి పి.మణి

బూర్జ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి పి.మణి అన్నారు. మండలంలో గల బూర్జ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, ఎస్ఐ బి.అశోక్‌బాబు, న్యాయవాదులు, కె.త్రినాథరావు, టి.అన్నంనాయుడు, విజయకుమార్, రాజేష్, ప్రసాద్, ఎంఈఓ ధనుంజయరావు, హెచ్‌ఎం లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

13న నీలమణి దుర్గ ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణి దుర్గ ఆలయం కానుకల హుండీ ఆదాయాన్ని ఈ నెల 13వ తేదీ బుధవారం ఉదయం పది గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు సోమవారం తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు, భక్తుల సమక్షంలో లెక్కించనున్నట్లు తెలిపారు. లెక్కింపునకు ఆసక్తి గల భక్తులు డ్రెస్‌కోడ్ పాటించాలని ఈఓ తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు కరకవలస పీడీ టీచర్


కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ యశోద

ఎల్.ఎన్.పేట: మండలంలోని కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీ (వ్యాయామ) టీచర్‌గా పని చేస్తున్న డి.యశోద జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 8వ తేదీ నుంచి గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయీస్ రాష్ట్ర క్రీడా పోటీల్లో ఆమె పాల్గొన్నారు. ఈ పోటీల్లో భాగంగా 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. త్వరలో చత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం పాలక రామారావు తెలిపారు. ఈ మేరకు యశోదకు హెచ్‌ఎంతో పాటు సహోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక చేయూత


హోంగార్డు కుటుంబానికి చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : గత నెలలో అనారోగ్యంతో మరణించిన హోంగార్డు సవర గాసేడు కుటుంబానికి జిల్లా హోంగార్డుల ఒక్క రోజు వేతనం నగదు చెక్కును ఎస్పీ జీఆర్ రాధిక అందజేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు కుటుంబానికి రూ. 4.23 లక్షల నగదు చెక్కును ఎస్పీ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డు గాసేడు మరణం చాలా బాధాకరమని, ఏ సహాయం కావాలన్నా జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ పీవీ నర్సింగరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మ కమలం


విరబూసిన బ్రహ్మకమలం పుష్పం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి దండుపాటి వీధిలో బ్రహ్మ కమలం విరబూసింది. దండుపాటి వీధికి చెందిన యలమంచిలి రామారావు ఇంటి పెరటలో ఉన్న బ్రహ్మకమలం సోమవారం సాయంత్రం ఇలా అందంగా విరబూయడంతో చుట్టుపక్కల వారంతా ఆసక్తిగా గమనించారు.

పీజీ ప్రవేశాలకు వేళాయె

- నేటి నుంచి పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్
- రాష్ట్రంలో 16 విశ్వవిద్యాలయాల పీజీ కోర్సుల్లో ప్రవేశాలు
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 కోర్సులు, 570 సీట్లు
- వర్సిటీ అఫిలియేషన్ కళాశాలల్లో 650 సీట్లు, మొత్తం 1220 సీట్లు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు సంబంధించిన ఆంధ్ర ప్రదేశ్ పోస్టు గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023 (ఏపీ పీజీసెట్–2023) కౌన్సెలింగ్ షెడ్యూల్ నోటిఫికేషన్‌ను ఏపీ ఉన్నత విద్యా మండలి సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం నుంచి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంతో పాటు, 16 విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది పీజీ సెట్‌ను ఆంధ్రా విశ్వవిద్యాలయం నిర్వహించింది. ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజును విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. ఓసీ, బీసీలకు రూ. 700, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ విద్యార్థులకు రూ.500గా ఫీజు నిర్ణయించారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, కౌన్సెలింగ్ ఆప్షన్ల నమోదు వంటి ప్రక్రియలకు హెచ్‌టీటీపీఎస్:సీఈటీఎస్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ లోకి వెళ్లి హాల్ టిక్కెట్, డేట్ ఆఫ్ బర్త్ ఆధారంగా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఫీజు డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చు. అనంతరం విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

షెడ్యూల్...

వెబ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్: ఈ నెల 12 నుంచి 20 వరకు కొనసాగుతుంది.

ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన: ఈ నెల 13 నుంచి 22 వరకు కొనసాగుతుంది.

ప్రత్యేక కేటగిరీలకు సంబంధించి విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజ్‌లో ధ్రువీకరణ పత్రాలు నేరుగా పరిశీలిస్తారు. పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్సు విద్యార్థులు షెడ్యూల్ మేరకు ఫీజు చెల్లించి హాజరు కావాల్సి ఉంటుంది.

వెబ్ ఆప్షన్ల నమోదు: ఈ నెల 20 నుంచి 24 వరకు

వెబ్ ఆప్షన్ల మార్పు: 25వ తేదీన

సీట్ల అలాట్‌మెంట్: 27న సాయంత్రం ఆరు గంటలకు

క్లాస్ వర్క్ : ఈ నెల 29వ తేదీన

అవసరమైన ధ్రువీకరణ పత్రాలు

హాల్ టిక్కెట్, ర్యాంకు కార్డు, బదిలీ ధ్రువీకరణ పత్రం, డిగ్రీ మార్కుల మెమో, డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, టెన్త్, ఇంటర్, డిప్లమా, స్టడీ, రెసిడెన్స్, ఆదాయ, కుల, ఎకనామికల్లీ వీకర్ సెక్షన్, లోకల్ స్టేటస్ వంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం మేరకు అప్‌లోడ్ చేయాలి.

వర్సిటీలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 కోర్సులు, 570 సీట్లు ఉన్నాయి. ఎకనామిక్స్‌లో 40, రూరల్ డెవలప్‌మెంట్‌లో 40, ఎంకాంలో 40, ఎంఎల్ఐఎస్సీలో 40, ఇంగ్లిష్‌లో 40, ఎంఈడీలో 40, సోషల్ వర్క్‌లో 40, తెలుగులో 40, ఎంజేఎంసీలో 3 0, మ్యాథ్స్‌లో 44, అప్లైడ్ మ్యాథ్స్‌లో 22, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 33, ఎనలిటికల్ కెమిస్ట్రీలో 22, బయోటెక్నాలజీలో 33, మైక్రో బయోలజీలో 22, ఫిజిక్స్‌లో 44 సీట్లు ఉన్నాయి. అఫిలియేషన్ కాలేజీలైన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల, గురజాడ, ఎస్ఎస్ఆర్, ఆదిత్య, రంగముద్రి కళాశాలల్లో 650 సీట్లు ఉన్నాయి. కెమిస్ట్రీ, ఫిజిక్స్, తెలుగు, జువాలజీ వంటి కోర్సులు ఉన్నాయి.

ప్రమాణాలతో కూడిన విద్య



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సులు నిర్వహిస్తున్నాం. అఫిలియేషన్ కళాశాలల్లో సైతం విద్యార్థులు చేరవచ్చు. వర్సిటీలో ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాం. అర్హత ఉన్న వారికి జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వర్తిస్తాయి. కౌన్సెలింగ్ షెడ్యూల్ మేరకు ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. విద్యార్థులు అందుబాటులో ఉన్న పీజీ విద్యను సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కర లేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

న్యూ సెంట్రల్ స్కూల్, పి.ఎన్.కాలనీ
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 95503 11265

'డ్రైవింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకోండి'


డ్రైవింగ్ శిక్షణ అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేసిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్ శిక్షణ తీసుకున్న అభ్యర్థులు ఆ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ నందు శిక్షణ పూర్తి చేసుకున్న 13వ బ్యాచ్ విద్యార్థులకు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ కుమార్ చేతులమీదుగా సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకున్న డ్రైవర్లను ఆయన అభినందించారు. ఆర్టీసీలో డ్రైవింగ్ అంటే క్రమశిక్షణ, అంకితభావంతో శిక్షణ కూడుకున్నదని అన్నారు. ఇక్కడ నేర్చుకున్న శిక్షణ మీ జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం చూడకుండా, ఇంటివాళ్లపై ఆధారపడకుండా మీ కాళ్లపై మీరు నిలబడేలా ఉండాలన్నారు. ఆర్టీసీలో డ్రైవింగ్ పోస్టులకు నోటిఫికేషన్ పడే సందర్భంలో ఈ సర్టిఫికెట్‌కు ప్రథమ ప్రాధాన్యత ఉంటుందన్నారు.

కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లు కె.మాధవ్, కెఆర్ఎస్ శర్మ, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ, ఏఎస్ఆర్ శ్రీనివాసు పాల్గొన్నారు. అనంతరం డ్రైవింగ్ శిక్షణ కోసం 14వ బ్యాచ్ ఈ వారంలో ప్రారంభమవుతుందని, వివరాలు కోసం 9963091999, 7382923293 నంబర్లను సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు కోరారు.

కండక్టర్ నిజాయితీ


ప్రయాణికుడికి పర్సును అప్పగిస్తున్న కండక్టర్ కేపీ రావు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని టెక్కలి డిపోకు చెందిన కండక్టర్ తన నిజాయితీని నిరూపించుకున్నారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం ప్రయాణిస్తున్న పాలఖండ్యాం గ్రామానికి చెందిన పల్లా మల్లేష్ అనే వ్యక్తి తాను ప్రయాణిస్తున్న బస్సులో విలువైన కార్డులతోపాటు రూ.3500 నగదు ఉన్న పర్సును జారవిడుచుకున్నారు. ఇంటికి వెళ్లిపోయాక పర్సు పోయినట్లు గుర్తించడంతో శ్రీకాకుళం బస్ స్టేషన్ మేనేజర్ నరేంద్రకు సమాచారం అందజేశారు. అదే విషయాన్ని ఆ బస్సు కండక్టర్ కేపీ రావును మేనేజర్ నరేంద్ర అడుగగా తన వద్దనే పర్సు ఉందని కండక్టర్ తెలియజేసి, శ్రీకాకుళం వచ్చి ఆ ప్రయాణికుడికి పర్సును అందజేశారు. కండక్టర్ నిజాయితీని అధికారులు, సహచర సిబ్బంది మెచ్చుకున్నారు.

డిగ్రీ కాలేజీకి ఫిజిక్స్ కోర్సు మంజూరుపై హర్షం

కంచిలి: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్యావిధానం అనుసరించి ఫిజిక్స్ ఏకైక ప్రధాన సబ్జెక్టుగా కేటాయించడంపై ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఆధ్వర్యంలో ఈ కోర్సు మంజూరు చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణను కోరామని ఆమె తెలిపారు. వాస్తవానికి 2023–24 విద్యా సంవత్సరంలో ఈ డిగ్రీ కళాశాలలో కేవలం గణితం ప్రధాన సబ్జెక్టుగా ఒక కోర్సును మాత్రమే మంజూరు చేశారని, ఫిజిక్స్ సబ్జెక్టు కోర్సు కావాలని కోరడంతో వెంటనే స్పందించి, ఈ మేరకు మంజూరు చేయడం ఇక్కడ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. రిప్రజెంటేషన్ ఇచ్చిన 39 రోజుల్లోనే మంజూరు చేసినట్లు తెలిపారు.

'గ్రానైట్ క్వారీల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి'

టెక్కలి రూరల్: చాలా గ్రానైట్ క్వారీల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని సీఐటీయూ నాయకులు అన్నారు. స్థానికులను కూలీలుగా తొలగించి బీహార్, రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకు వచ్చి పనులు చేయిస్తున్నారని, అద్దుకొండ సర్వేలో గల స్టెర్లిన్ స్టోనెక్స్ గ్రానైట్ కంపెనీలో ఐదేళ్లుగా పనిచేస్తున్న 40 మందిని తొలగించారని తెలిపారు. వీరిపై చర్యలు తీసుకోవాలని సోమవారం టెక్కలి తహసీల్దార్ ప్రవల్లికకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సిఐటీయూ నాయకులు నంబూరి షణ్ముఖరావు, సింహాచలం, డి.భీమారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

'పనుల్లో నాణ్యత పాటించాల్సిందే'


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో రోడ్లు, కాలువలు, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు ప్రజలకు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని మంత్రి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో పలు రహదారి నిర్మాణ పనులకు మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ రోడ్లు మొత్తం రూ.1.82 కోట్లతో పాత్రునివలస నుంచి పెద్దపాడు పెట్రోల్ బంక్ వరకు సుమారు 1.95 కిలోమీటర్ల మేర రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. అలానే తంగివానిపేట నుంచి వానవానిపేట వరకూ 1.5 కిలోమీటర్ల మేర రహదారి పనులు చేపట్టనున్నారు. వీటిని నాణ్యతతో చేపట్టాలని, ఎలాంటి లోపాలు లేకుండా పనులు చేయించాలని అధికారులను మంత్రి ధర్మాన ఆదేశించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు సంక్షేమమే తప్ప అభివృద్ధి లేదని దుష్ప్రచారాలను ప్రజలెవ్వరు నమ్మే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సాదు వైకుంఠరావు, డాక్టర్ పైడి మహేశ్వరరావు, కాంట్రాక్టర్ కింజరాపు శ్రీనివాస్, గాంధీ, తంగి అప్పన్న, అసిరినాయుడు, గుడ్ల దాము తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు వాయిదా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు వాయిదా పడ్డాయి. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు జరగాల్సిన జిల్లాస్థాయి క్రీడాపోటీలను ప్రతికూల వాతావరణం నేపథ్యంలో వాయిదా వేసినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. తదుపరి పోటీలు జరిగే తేదీని త్వరలో వెల్లడిస్తామని ఆయన చెప్పారు.

ఎయిడ్స్‌పై మరింత అవగాహన


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణలో భాగంగా ప్రజలకు, యువతకు మరింత అవగాహన పెంచేందుకు ఉద్దేశించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతకు అవగాహన పెంచేందుకు త్వరలో జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని డీఎంహెచ్ఓ బి.మీనాక్షి తెలిపారు. ఏపీ ఎస్ ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో 17–25 ఏళ్ల యువతకే 5కే రన్, క్విజ్, రీల్ మేకింగ్, డ్రామా మొదలైన విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇక్కడ గెలిచిన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, డీఆర్ఓ ఎం.గణపతి రావు, జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, వైద్యాధికారులు ఉన్నారు.

ఆర్బీకే అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

కంచిలి: మండలంలోని కొల్లూరు గ్రామ సచివాయం ఆవరణలో గల రైతుభరోసా కేంద్రం భవనం చుట్టూ ఉన్న కిటికీల అద్దాలు పగులగొట్టిన కేసులో అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై కంచిలి ఎస్ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కొల్లూరులో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనాన్ని 11వ తేదీ సోమవారం ప్రారంభించారు. అయితే ఆ ముందురోజు రాత్రి అదే గ్రామానికి చెందిన దువ్వ సుమంత్ అనే వ్యక్తి ఓ పెళ్లి పార్టీకి వెళ్లి వస్తూ ఆర్బీకే చుట్టూ ఉన్న కిటికీ అద్దాలు పగులగొట్టాడు. దీనిపై భవన నిర్మాణ కాంట్రాక్టర్ గేదెల భీమారావు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు సుమంత్ ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు గుర్తించడంతో అతడిపై కేసు నమోదు చేశారు. పగిలిపోయిన అద్దాల విలువ రూ.1.80లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

టెక్కలిలో వరుస దొంగతనాలు

టెక్కలి: టెక్కలిలో ఇటీవల కాలంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. కొన్నాళ్ల కిందట శ్రీనివాసానగర్‌లో జరిగిన చోరీ మరచిపోక మునుపే తాజాగా ఆదివారం టెక్కలి ఆర్టీసీ డిపో ఎదురుగా ఓ ఇంటిలో బంగారం, నగదు చోరీ జరిగింది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా తినుబండారాల దుకాణం నిర్వహిస్తున్న విజయ్‌సాహు, డిపో ఎదురుగా నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి చేరుకోగా ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో భయాందోళన చెందాడు. ఇంటి మొత్తం పరిశీలించగా, ఇంట్లో ఉన్న అర తులం బంగారం ఉంగరంతో పాటు దాచుకున్న రూ.57 వేలు చోరీ జరిగినట్లు గుర్తించాడు. దీంతో టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టెక్కలిలో ఇటీవల వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు.

తండ్రిపై తనయుడి దాడి

- ఆస్పత్రికి తరలిస్తుండగా తండ్రి మృతి
- టెక్కలి భూలోకమాత వీధిలో దారుణం


మృతుడు ధర్మేంద్ర (ఫైల్)

టెక్కలి రూరల్: మద్యం మత్తులో తల్లితో గొడవపడుతున్నారనే కోపంలో కొడుకు తండ్రిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి చేయగా ఆయన ఏకంగా ప్రాణాలు కోల్పోయిన ఘటన టెక్కలి భూలోకమాతవీధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక భూలోకమాతవీధిలో నివాసముంటున్న బాడ ధర్మేంద్ర(57) అనే వ్యక్తి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చిన్నబడ్డీలో పువ్వులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య జానకి ఇద్దరు కుమారులు ప్రేమ్, సుమిత్‌లు ఉన్నారు. అయితే ధర్మేంద్ర నిత్యం భార్యతో గొడవలు పడుతుండేవాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో కూడా ధర్మేంద్ర తన భార్యతో గొడవ పడుతుండగా కలుగుజేసుకున్న పెద్దకుమారుడు ప్రేమ్ తండ్రిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో తండ్రీ కొడుకుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో తీవ్ర ఆవేశానికి గురైన ప్రేమ్ ఇంటిలో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో తండ్రిపై దాడి చేశాడు. ధర్మేంద్రకు గట్టిగా దెబ్బ తగలడంతో వెంటనే ఆయనను తల్లీకొడుకులే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా దారిలోనే ధర్మేంద్ర చనిపోయారు. విషయం తెలుసుకున్న టెక్కలి పోలీసులు ప్రేమ్‌ను అదుపులో తీసుకున్నారు. టెక్కలి ఎస్ఐ–2 రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,380–00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220